సాక్షి
రాజన్న సిరిసిల్ల
గురువారం । 27 । ఏప్రిల్ । 2023



పనులు పరిశీలన

వేములవాడఅర్బన్: రుద్రవరం, అనుపురం గ్రామాల్లోని పాఠశాలల్లో మన ఊరు–మన బడి పనులను డీఈవో రమేశ్‌కుమార్ బుధవారం పరిశీలించారు.



కార్మికవ్యతిరేక విధానాలు

సిరిసిల్లఅర్బన్: ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని బీఎంఎస్ బీడీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా చేశారు.

గరిష్టం/కనిష్టం
35.0/23.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

గోశాలలకు రాజన్న కోడెలు



గోశాలకు కోడెలను అందిస్తున్న అధికారులు

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని రాజన్న గోశాలలోని కోడెలను వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లోని గోశాలలకు బుధవారం అందజేశారు. వరంగల్ జిల్లా వేలూరు మండలం పీచర గ్రామానికి చెందిన శ్రీలక్ష్మీ గోశాలకు 20 కోడెలు, మహబూబాబాద్ జిల్లా ఇన్‌గూర్తి మండలం మేచరాజుపల్లికి చెందిన మహాలక్ష్మీ గోశాలకు 20 కోడెలను అందజేశారు. ఆలయ అధికారులు శ్రీనివాస్, నరసింహమూర్తి, శంకర్, శ్యామ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి



విద్యార్థులకు బంగారు పతకాలు అందజేత

వేములవాడఅర్బన్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని.. లక్ష్యాన్ని చేరుకునేందుకు ముందుకెళ్లాలని శాతవాహన విశ్వవిద్యాలయం ఉపకులపతి సంకశాల మల్లేశం సూచించారు. వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అకాడమిక్ సెల్ ఆధ్వర్యంలో బుధవారం అకాడమిక్ ఫెస్టివల్, బంగారు పతకాల ప్రదానోత్సవం నిర్వహించారు. వీసీ మల్లేశం మాట్లాడుతూ విద్యార్థులు రోజుకు కనీసం ఆరు గంటలు చదువుకోవాలన్నారు. టీవీ, సెల్‌ఫోన్‌లకు బానిసకాకుండా.. విజ్ఞానం కోసం వినియోగించుకోవాలని సూచించారు. 2019–2022 విద్యా సంవత్సరంలో అకాడమిక్ పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన డిగ్రీ, పీజీ విద్యార్థులు గౌతమి, వివేక్, శ్రేష్ఠ, రమ్య, మౌనిక, అర్చన, వెంకటేశ్, ప్రసన్న, భార్గవ్, ప్రవీణ్, నర్మద, నీరజ, మాణికేశ్వరీలకు బంగారు పతకాలను అందజేశారు. యూనివర్సిటీ పరీక్షల విభాగాధిపతి ఎన్వీ శ్రీరంగప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్, వైస్‌ప్రిన్సిపాల్ తిరుకోవెల శ్రీనివాస్, అధ్యాపకులు మధు రాజేశ్, మల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, అంజాత్ అలీ, అఫ్సారీ ఉస్మానీ, రాజేశ్, ప్రభాకర్, నారాయణ, నర్సయ్య, కరుణ, దీపిక, అర్జున్, రమేశ్‌బాబు పాల్గొన్నారు.

చనిపోయిన వారికి పింఛన్లపై విచారణ



విచారణ చేపడుతున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని నిజామాబాద్‌లో అధికారులు పింఛన్లపై బుధవారం విచారణ చేపట్టారు. 'చనిపోయిన వారికి పింఛన్లు' శీర్షికతో ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వితంతు పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్నా మంజూరుకాని గుండ లక్ష్మిని విచారించారు. డీఆర్డీఏ ఏపీవో పాపారావు, కార్యదర్శి కవితారెడ్డి ఇంటింటి సర్వే చేయగా.. ఆరుగురికి అక్రమంగా పింఛన్ వస్తున్నట్లు గుర్తించారు. మృతిచెందిన ముష్కం రామయ్య ఖాతాలో పడిన రూ.42,336లను నోడల్ అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. మిగతా వారి ఖాతాలో జమవుతున్న డబ్బులను నోడల్ ఖాతాకు బదిలీ చేయాలని బ్యాంకులో సిఫారసు చేశారు.

వైద్య, ఆరోగ్యశాఖలో పోస్టుల భర్తీ

సిరిసిల్లటౌన్: జిల్లా వైద్యారోగ్యశాఖలో కలెక్టర్ ఆదేశాలతో వివిధ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు బుధవారం తెలిపారు. పిడియాట్రీషియన్(ఎండీ) 1, సైకోథెరపిస్టు 1, స్టాఫ్‌నర్సు 1, ల్యాబ్ టెక్నీషియన్ 1, డెంటల్ టెక్నీషియన్ 1 పోస్టు చొప్పున భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. 18 నుంచి 44 ఏళ్ల వరకు(ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఐదేళ్ల మినహాయింపు) వయస్సు ఉండాలన్నారు. అర్హత గల అభ్యర్థులు బయోడేటాతోపాటు సంబంధిత సర్టిఫికెట్లను డీఎంహెచ్‌వో ఆఫీస్‌లో ఈనెల 27 నుంచి మే 2 వరకు సాయంత్రం 5 గంటల్లోపు అందజేయాలని సూచించారు.

'ఫిబ్రవరిలో తీగలగుట్టపల్లిలోని ఓ షాపునకు వెళ్లే లోడు మందులో నీళ్లు కలిపారన్న సమాచారంతో ఎక్సైజ్ అధికారులు దాడి చేశారు. ఈ దాడిలో నీళ్లు కలిపిన మందుబాటిళ్లు పట్టుబడ్డాయి. పరీక్షల్లో మద్యంలో నీళ్లు కలిపారని తేలింది. వాస్తవానికి షాపు యజమానికి ఈ వ్యవహారంతో సంబంధం లేదు. మార్గమధ్యలో డ్రైవర్లు, సిబ్బంది కలిసి ఈ కల్తీకి పాల్పడ్డారని అధికారులు గుర్తించారు. అయినా.. సరుకు షాపులో దొరికింది కాబట్టి దీనిపై కేసు నమోదు చేసిన ఎక్సైజ్ పోలీసులు, యజమానికి జరిమానా కూడా విధించారు.

గతవారం కరీంనగర్‌లో ఓ ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. ఐఎంఎల్ డిపో నుంచి గంగాధరకు బయల్దేరిన వాహనం మానేరు డ్యాం కట్ట సమీపంలో నీళ్లు కలుపుతుండగా.. ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. ఈ విషయంలో ఆఫీసర్ల కంటే రెండాకులు ఎక్కువే చదివిన డ్రైవర్.. వెంటనే సరుకు వారి చేతికి చిక్కకుండా సీసాలన్నీ రోడ్డు మీదే పగులగొట్టాడు. చేసేది లేక వాహనాన్ని మాత్రమే సీజ్ చేసి ఎక్సైజ్ కార్యాలయానికి తరలించారు. ఈ వ్యవహారంలో కేసు నమోదు కాలేదని తెలిసింది.

తరచుగా తీగలగుట్టపల్లిలోని బెల్టుషాపులో మందు తాగే ఓ వ్యక్తికి రుచిలో తేడా వచ్చింది. ఇదేంటి? తాను తాగిన మందు ఎక్కడం లేదని షాపు నిర్వాహకులతో గొడవకు దిగాడు. తమకేం సంబంధం లేదని.. వచ్చిన సరుకును అమ్ముతున్నామని బెల్టుషాపు నిర్వాహకుడు చెప్పాడు. సిరిసిల్ల, సుల్తానాబాద్, పెద్దపల్లి, జగిత్యాల గంగాధర మండలంలో తాము కొన్న మందు పలుచగా ఉందని కొందరు మందుబాబులు తరచుగా ఫిర్యాదులు చేస్తున్నారు. మొత్తానికి తాము తాగే మందు గతంలోలా కిక్కు ఇవ్వడం లేదన్నది వారి వాదన. ఒకరిద్దరు అంటే ఏమో అనుకోవచ్చు కానీ, పదే పదే మందుబాబులు ఇదే ఫిర్యాదు రావడం వెనక ఏం జరుగుతోంది? అన్న విషయంపై 'సాక్షి' పరిశోధనలో పలు ఆసక్తికర విషయాలు తెలిశాయి.

కిక్కివ్వని మందు

వైన్‌షాపుల సరుకు దారిదోపిడీ చేస్తున్న డ్రైవర్లు

- లోడుకు 15 వరకు ఫుల్‌బాటిళ్లు నీళ్లతో కల్తీ
- వినియోగదారులు తాగేది నీళ్ల మందేనా?
- కిక్కు రాక పరేషాన్ అవుతున్న మద్యంప్రియులు
- ఉమ్మడి జిల్లాలో తూతూ మంత్రంగా నౌకర్‌నమా!
- లోడుకు రూ.10 వేల చొప్పున రూ.లక్షన్నర వరకు స్వాహా
- మొత్తం విలువ ఏడాదికి రూ.5 కోట్ల పైమాటే..!



కరీంనగర్ ఎక్సైజ్ స్టేషన్‌లో పట్టుబడ్డ వాహనం(ఫైల్)

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్ ఐఎంఎల్ డిపో నుంచి దాదాపుగా ఉమ్మడి జిల్లాలోని సిరిసిల్ల, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల వైన్‌షాపులకు మందు సరఫరా జరుగుతుంటుంది. ఈ డిపో నుంచి రోజుకు 20 నుంచి 30 వరకు సరుకు లోడ్లు వెళ్తుంటాయి. సరుకును క్షేమంగా షాపుల్లోకి చేర్చాల్సిన కొందరు వాహనాల డ్రైవర్లు, సహాయకులు, సరుకు దించే వారు కుమ్మక్కవుతున్నారు. వాహనాన్ని ఏదైనా నిర్మానుష్య ప్రాంతంలో నిలిపివేసి ఎవరూ చూడకుండా సీల్ చెదరకుండా ఫుల్ బాటిల్ (750 ఎంఎల్ నుంచి 1000 ఎంఎల్) ఓపెన్ చేసి అందులో క్వార్టర్ (180ఎంఎల్ నుంచి 200 ఎంఎల్) వరకు మందును వేరే బాటిళ్లలో నింపుతున్నారు. అనంతరం తిరిగి సీల్ వేసి షాపులకు వెళ్లాల్సిన సరుకులో కలుపుతున్నారు. వాటిని అప్పటికే సిద్ధం చేసిన అవే బ్రాండు బాటిళ్లలో నింపి, బెల్టుషాపులకు ఎంతో కొంతకు విక్రయిస్తున్నారు. అక్కడ వాళ్లు ఇంకొన్ని నీళ్లు కలిపి రాత్రీ పగలు తేడా లేకుండా అమ్ముతున్నారు. ఈ లెక్కన మార్గమధ్యంలో, కొన్ని వైన్‌షాపుల్లో, దాదాపుగా అన్ని బెల్టుషాపుల్లో మద్యంలో నీళ్లు కలుపుతున్నారు. ఇది తెలియని వినియోగదారులు ఎంత తాగినా తమకు కిక్కు రావడం లేదని నెత్తీనోరు బాదుకుంటున్నారు. ఈ విషయంలో ఎక్సైజ్ డిపార్ట్‌మెంటుకు పలు ఫిర్యాదులు వెల్లువెత్తున్నాయి. దీంతో ఎక్సైజ్ శాఖ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి దీనిపై కొన్ని నెలలుగా నిఘా ఏర్పాటు చేసింది.

సరిగా అమలుకాని నౌకర్ నమా..!

వాస్తవానికి ఐఎంఎల్ డిపో.. తమకు వచ్చిన ఆర్డర్ పరంగా సరుకును వాహనాల్లోకి ఎక్కిస్తారు. అంతవరకు వీరి బాధ్యత. తరువాత మద్యం కల్తీ జరిగే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ఎక్సైజ్‌శాఖ చాలా కాలంగా నౌకర్‌నుమాను ప్రవేశపెట్టింది. అంటే సరుకును షాపు వరకు తీసుకువచ్చేందుకు ప్రతీ షాపు నుంచి ముగ్గురు సిబ్బందికి ఎక్సైజ్‌శాఖ ప్రత్యేక అనుమతి ఇస్తుంది. సరుకు ఐఎంఎల్ డిపో నుంచి వైన్‌షాపు చేరేవరకు వీరిదే పూర్తి బాధ్యత. కానీ.. ఉమ్మడి జిల్లాలో ఈ విధానం సరిగా అమలు కావడం లేదు. వైన్ షాపు యజమానుల్లో చాలామంది తాము ఎంపిక చేసిన నౌకర్ నమాలను వాహనంతోపాటు పంపడంలో నిర్లక్ష్యం చూపిస్తున్నారు. దీంతో మార్గమధ్యలో వాహనంలో ఉన్న సిబ్బంది నీళ్లు కలిపిన మందును షాపులకు, బెల్టుషాపులకు చేరవేస్తున్నారు.

రోజుకు రూ.లక్షకుపైగానే సరుకు స్వాహా!

ప్రతిరోజూ ఎంతలేదన్నా.. 20 నుంచి 30 వరకు సరుకు వాహనాలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సరకు డెలివరీ చేస్తాయి. డ్రైవర్లు తలచుకుంటే.. ప్రతీ లోడుకు 15 నుంచి 20 బాటిళ్లు, ప్రతీ ట్రిప్పుకు కల్తీ చేసే అవకాశం ఉంటుంది. సగం లోడు వాహనాల్లో కల్తీ జరిగినా.. ఈ లెక్కన రోజుకు రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు సరకు కల్తీ అవుతోందన్నది ఎక్సైజ్ వర్గాల సమాచారం. ఇది నెలకు రూ.45 లక్షలుగా, ఏడాదికి దాదాపుగా రూ.కోటి నుంచి రూ.5.40 కోట్లకుపైగా సరుకును స్వాహా చేస్తున్నారని ఓ ఎక్సైజ్ అధికారి అభిప్రాయపడ్డారు.



మద్యం కల్తీ చేస్తున్న డ్రైవర్ (ఫైల్)

ఆందోళన వద్దు.. అండగా ఉంటాం

- రైతులకు మంత్రి కేటీఆర్ భరోసా
- జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి కేటీఆర్



ఫోన్‌లో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

సిరిసిల్ల: అకాల వర్షాలతో రైతులు ఆందోళనకు గురికావద్దని, ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కె.తారక రామారావు పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి బుధవారం కలెక్టర్, ఎస్పీ, వ్యవసాయాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. జిల్లాలో పరిస్థితిపై ఆరా తీశారు. రైతులు ఆందోళన చెందవద్దని.. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా నిచ్చారు. నష్టపోయిన రైతుల వివరాలు సేకరించాలని, వచ్చే రెండు, మూడు రోజుల్లోనూ ఇంకా వర్షాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. రైతులు అధైర్యపడకుండా ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు, అన్ని స్థాయిల్లోని ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు భరోసా ఇవ్వాలని కోరారు. రైతులకు అందుబాటులో ఉండాలని ప్రజాప్రతినిధులకు సూచించారు.

4,157 మందికి కంటివెలుగు పరీక్షలు

సిరిసిల్లఅర్బన్: జిల్లాలో బుధవారం 4,157 మందికి కంటి వెలుగులో పరీక్షలు చేశారు. ఇందులో 589 మందికి రీడింగ్ గ్లాసులు, 722 మందికి పాయింట్ అద్దాలను అందించారు. జిల్లా వ్యాప్తంగా 26 క్యాంపులు నిర్వహించగా 234 మంది సిబ్బంది పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి



వెంకటాపూర్‌లో తడిసిన ధాన్యంతో రైతుల రాస్తారోకో

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరుతూ మండలంలోని వెంకటాపూర్‌లో బుధవారం రైతులు రోడ్డెక్కారు. సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిపై సుమారు మూడు గంటలపాటు రాస్తారోకో చేశారు. రైతులకు బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. రైతులు, బీజేపీ నాయకులు మాట్లాడుతూ స్థానికంగా 15 రోజుల క్రితం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినప్పటికీ ఒక్క గింజను కూడా కొనలేదన్నారు. ఈ సందర్భంగా ఆందోళన విరమించాలని ఒత్తిడి చేసిన పోలీసులతో రైతులు వాగ్వాదానికి దిగారు. ధర్నాలో బీజేపీ మండలాధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లగిశెట్టి శ్రీనివాస్, ఉపసర్పంచ్ మెడిశెట్టి బాలయ్య, నాయకులు ఆడెపు రవీందర్, శీలం రాజు, లక్ష్మారెడ్డి, గడ్డం రవి, రైతులు గుర్రాల రాజిరెడ్డి, మహేశ్, శేఖర్, గోపి, రవి, రాంరెడ్డి, మురళి పాల్గొన్నారు.

ఐదుగురు బీజేపీ నాయకులపై కేసు

అనుమతుల్లేకుండా రోడ్డుపై బైటాయించిన ఐదుగురు బీజేపీ నాయకులపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై శేఖర్ తెలిపిన వివరాలు. వెంకటాపూర్ శివాజీ విగ్రహం వద్ద సిరిసిల్ల–కామారెడ్డి రోడ్డుపై పొన్నాల తిరుపతిరెడ్డి, మేడిశెట్టి బాలయ్య, గడ్డం రవి, చందుపట్ల లక్ష్మారెడ్డి, గుగులోతు అనిల్ రైతులను ప్రోత్సహించి రోడ్డుపై కూర్చొని రాకపోకలకు ఇబ్బంది కల్గించడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైతులు అధైర్య పడొద్దు

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య
- పంటల పరిశీలన



మహిళా రైతును ఓదారుస్తున్న ఆగయ్య



మర్రిగడ్డలో పరిశీలిస్తున్న రమేశ్‌బాబు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులు అధైర్యపడొద్దని.. ప్రభుత్వం అండగా ఉంటుందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు గడ్డం నర్సయ్య రైతులకు భరోసానిచ్చారు. ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్, అల్మాస్‌పూర్, గుంటపల్లి చెరువు తండా, పదిర గ్రామాల్లో వడగండ్ల వానతో నష్టపోయిన పంటలను బుధవారం అధికారులతో కలిసి పరిశీలించారు. నష్టపోయిన రైతులకు భరోసా కల్పించారు. గుంటపల్లిచెరువు తండాలో గిరిజన మహిళా రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. చేతికొచ్చిన పంట నేలపాలైందని పరిహారం ఇచ్చి ఆదుకోవాలని వేడుకున్నారు. వడగళ్ల వానతో నష్టపోయిన పొలాలను పరిశీలించి రైతుల వివరాలను కలెక్టర్‌కు అందజేయాలని వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. మంత్రి కేటీఆర్‌తో నష్టంపై మాట్లాడి రైతులు నష్టపోకుండా సాయం అందిస్తామన్నారు. జిల్లా వ్యవసాయాధికారి రణధీర్‌రెడ్డి, తహసీల్దార్ జయంత్‌కుమార్, ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, మండల వ్యవసాయాధికారి భూంరెడ్డి తదితరులు ఉన్నారు.

రైతులను ఆదుకుంటాం
– వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు

చందుర్తి/రుద్రంగి(వేములవాడ): అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు పేర్కొన్నారు. చందుర్తిమండలంలోని మర్రిగడ్డ, చందుర్తి, రుద్రంగి మండల కేంద్రంలో వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను బుధవారం పరిశీలించి మాట్లాడారు. వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పంటనష్టం వివరాలు అందించాలని సూచించారు. మండలంలో 760 ఎకరాలలో పంటనష్టం ఏర్పడినట్లు ప్రభుత్వానికి నివేదించామని, మిగతా వారిని సైతం గుర్తించి న్యాయం చేస్తామన్నారు. ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని సూచించారు. రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ ఏనుగుల శ్రీనివాస్, ఎంపీపీ బైరగోని లావణ్య, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు, చందుర్తి సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్, తహసీల్దార్ మజీద్, ఎంపీడీవో రవీందర్, ఇన్‌చార్జి ఏవో ప్రణీత, సర్పంచులు చిలుక అంజిబాబు, దుమ్ము అంజయ్య ఉన్నారు.

పంటలు పరిశీలించిన అదనపు కలెక్టర్

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి/గంభీరావుపేట(సిరిసిల్ల): వడగండ్ల వానతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, ఆర్డీవో శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం గుంటపల్లిచెరువుతండా, కోరుట్లపేట, వీర్నపల్లి మండలం కంచర్ల, గంభీరావుపేట మండలం గోరింటాల, మల్లుపల్లి గ్రామాల్లో పంటలను పరిశీలించారు. వీర్నపల్లిమండలంలోని రంగంపేట, ఎర్రగడ్డ తండా, లాల్‌సింగ్ తండా, వన్‌పల్లి, శాంతినగర్, గంభీరావుపేట గజసింగవరం గ్రామాల్లో నష్టపోయిన పంటలను టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పరిశీలించారు. వెంటనే సర్వే చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

స్ఫూర్తిని చంపి.. మూర్తిని పెట్టారు

- ప్రజాసంఘాల ఉమ్మడి వేదిక నిరసన గళం
- పోలీస్ నిఘాలో సిరిసిల్లలో సభ
- పాతికేళ్లకు కలిసిన విప్లవకారులు కూర రాజన్న, చలపతిరావు



తెలంగాణ అమర వీరుల స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు



సిరిసిల్ల సభకు హాజరైన ప్రజా సంఘాల నాయకులు

సిరిసిల్ల: రాష్ట్రంలో రాజ్యాంగ స్ఫూర్తిని చంపి.. అంబేడ్కర్ మూర్తిని పెట్టారని ప్రజాసంఘాల ఉమ్మడి వేదికలో వక్తలు వ్యాఖ్యానించారు. సిరిసిల్లలోని పద్మనాయక కల్యాణ మండపంలో బుధవారం ప్రజాసంఘాల ఉమ్మడి వేదిక సమావేశం నిర్వహించారు. సీపీఐ(ఎంఎల్) జనశక్తి అగ్రనేత కూర రాజన్న అలియాస్ రాజేందర్ జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత తొలిసారి బహిరంగ సభలో మాట్లాడారు. ప్రజాప్రభుత్వాన్ని సాధించేందుకు ప్రజలే పోరాడాలన్నారు. సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకుడు జేవీ చలపతిరావు మాట్లాడుతూ ప్రజాస్వామిక హక్కులను రాజ్యం కాలరాస్తోందన్నారు. అర్బన్ నక్సలైట్లు అంటూ.. నిర్బంధాన్ని అమలు చేస్తున్నారని, వరవరరావు, సాయిబాబా వంటి వారిని జైలులో పెట్టారని ఆరోపించారు. విప్లవ శక్తులు ఏకం కావాలని కోరారు. ముందుగా అమరవీరులకు నివాళిగా మౌనం పాటించారు.

ప్రసంగాల పరంపర

బొమ్మకంటి కొమరయ్య అధ్యక్షతన సాగిన సభలో పౌరహక్కుల సంఘం నాయకులు లక్ష్మణ్, ప్రజాసంఘాల ఉమ్మడి వేదిక ప్రతినిధి సంతోష్, ఏఐఎఫ్‌టీయూ(న్యూ) నాయకుడు గుర్రం విజయ్‌కుమార్, తెలంగాణ విద్యావంతుల వేదిక ప్రతినిధి అంబటి నాగన్న, ప్రజాగాయని విమలక్క, టీఆర్‌సీపీఎస్ ప్రతినిధి పటోళ్ల నాగిరెడ్డి, ఏఐఎఫ్‌టీయూ ప్రతినిధి మల్లేశం, శ్రామికశక్తి బీడీ కార్మిక సంఘం నాయకులు అనసూయ, అరుణోదయ బైరాగి మోహన్, పీడీఎస్‌యూ(విజృంభణ) ప్రతినిధి అల్లూరి విజయ్, పీవోడబ్ల్యూ(స్త్రీవిముక్తి) ప్రతినిధి పద్మ, ఎస్‌జీఎల్‌బీకేఎస్ ప్రతినిధి రాములు, ఉస్మానియా యూనివర్సిటీ ప్రతినిధి రంజిత్, పోకల సాయి ప్రసంగించారు. పోలీసు నిర్బంధాన్ని తమ ప్రసంగాల్లో ఎండగట్టారు.

మారుమోగిన అరుణోదయ పాటలు

సభలో అరుణోదయ కళాకారుల పాటలు మారుమోగాయి. విమలక్కతోపాటు కళాకారులు పాడిన పాటలు సభకు హాజరైన వారిలో ఉత్తేజం నింపాయి. అమరవీరులకు నివాళి అర్పించారు.

పాతికేళ్లకు కలిసిన పాత మిత్రులు

జిల్లాలో 45 ఏళ్ల కిందట విప్లవోద్యమానికి బాటలు వేసిన ఉద్యమకారులు పాతికేళ్ల తరువాత సిరిసిల్ల వేదికగా కలుసుకున్నారు. దున్నేవాడిదే భూమి అంటూ.. రైతుకూలీ సంఘంగా ఆవిర్భవించి నిమ్మపల్లి భూస్వామ్య వ్యతిరేక పోరాటంతో మొదలైన జనశక్తి ఉద్యమానికి ఊపిరులూదిన కూర రాజన్న, జేవీ చలపతి రావు ఒకే వేదికపై కూర్చుని మాట్లాడారు. వేములవాడకు చెందిన కూర రాజన్న జనశక్తి అగ్రనేతగా ఉన్నారు. చందుర్తి మండలం తిమ్మాపూర్‌కు చెందిన చలపతిరావు 1994 వరకు జనశక్తి పార్టీలో కొనసాగి, ఇప్పుడు న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడిగా ఉన్నారు. ఒకే బాటగా సాయుధులుగా నడిచిన ఆ ఇద్దరు విప్లవ వైరుధ్యాలతో విడిపోయి కలిశారు. పరస్పరం గౌరవంతో వేదికపై ప్రసంగించడం విశేషం.

సిరిసిల్లలో ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు

- పవర్‌లూమ్స్‌పై చేనేత వస్త్రాల ఉత్పత్తి
- నిబంధనలు ఉల్లంఘించిన వస్త్రోత్పత్తిదారులు
- పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కేంద్ర చేనేత, జౌళిశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం దాడులు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పవర్‌లూమ్స్(మరమగ్గాలు)పై చేనేతవస్త్రాలను ఉత్పత్తి చేస్తున్నట్లు కేసు నమోదు చేశారు. సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన అన్నల్‌దాస్ శ్రీనివాస్ చేనేత పరిశ్రమకు రిజర్వ్ చేసిన వస్త్రాలను పవర్‌లూమ్స్‌పై ఉత్పత్తి చేస్తున్నారు. చేనేత మగ్గం (హ్యాండ్‌లూమ్)పై ఉత్పత్తి చేయాల్సిన వస్త్రాలను పవర్‌లూమ్స్‌పై ఉత్పత్తి చేయడం చేనేత రిజర్వేషన్ చట్టం–1985 ప్రకారం చట్టవిరుద్ధం. కేంద్ర ప్రభుత్వ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి మనోహర్, రాష్ట్ర జౌళిశాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశం సిబ్బందితో క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయగా.. చట్టం ఉల్లంఘన జరిగినట్లు నిర్ధారణ అయింది. దీంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కేసు నమోదు చేసి, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఫిర్యాదు మేరకు అన్నల్‌దాస్ శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ అనిల్‌కుమార్ తెలిపారు. ఈ కేసును సిరిసిల్ల టౌన్ ఎస్‌ఐ బి.తిరుపతి దర్యాప్తు చేస్తున్నారు. సిరిసిల్లలో కేంద్ర ప్రభుత్వ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేయడం, క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

రాజన్న సన్నిధిలో భక్తులు



వేములవాడ: రాజన్నను బుధవారం 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఏర్పాట్లను ఈవో కృష్ణప్రసాద్, ఏఈవోలు శ్రీనివాస్, ప్రతాప నవీన్, పర్యవేక్షకులు తిరుపతిరావు, అల్లి శంకర్ పరిశీలించారు. వరుసగా కురుస్తున్న ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలకు విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది.

క్లుప్తంగా

చివరి ధాన్యం గింజ వరకూ కొంటాం



కస్బెకట్కూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చిక్కాల రామారావు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు పేర్కొన్నారు. మండలంలోని కస్బెకట్కూర్‌లో బుధవారం సిరిసిల్ల పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సింగిల్‌విండో చైర్మన్ బండి దేవదాస్‌తో కలిసి ప్రారంభించారు. రామారావు మాట్లాడుతూ చివరి ధాన్యం గింజ వరకు కొంటామని, రైతులు అధైర్యపడొద్దన్నారు. సర్పంచ్ వలకొండ వేణుగోపాలరావు, రైతులు పాల్గొన్నారు.

నిరుపేద యువతి వివాహానికి ఆర్థిక సాయం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్ల బొప్పాపూర్‌కు చెందిన నిమ్మల అశోక్ కూతురు వివాహానికి గౌడసంఘం జిల్లా అధ్యక్షుడు చిదుగు గోవర్ధన్‌గౌడ్ బుధవారం రూ.61,116 ఆర్థిక సాయం అందించారు. గోవర్ధన్‌గౌడ్ వితరణ చేసిన డబ్బులను లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వంగల రవీందర్ చేతుల మీదుగా అందజేశారు. తన కూతురు వివాహానికి చేయూతనందించిన గోవర్ధన్‌గౌడ్‌కు అశోక్ కృతజ్ఞతలు తెలిపారు. లయన్స్ క్లబ్ సెక్రెటరీ రామచంద్రం, జోన్ చైర్మన్ నంది కిషన్, గౌరె మల్లేశం, పెంజర్ల రవి ఉన్నారు.

సిరిసిల్ల టౌన్‌క్లబ్ ఎన్నికలు ఏకగ్రీవం



అధ్యక్షుడు ప్రకాశ్, నూతన కార్యవర్గం

సిరిసిల్ల టౌన్ : రెండేళ్లకోసారి నిర్వహించే సిరిసిల్ల టౌన్‌క్లబ్ ఎన్నికలు ఈసారి ఏకగ్రీవమయ్యాయి. అధ్యక్షుడిగా చొప్పదండి ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి బుర్ర నారాయణ గౌడ్, ఉపాధ్యక్షుడు యెల్ల లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శిగా నీలి రవీందర్, కోశాధికారిగా మ్యాన ప్రసాద్ ఎన్నికయ్యారు. బుధవారం స్థానిక పద్మశాలీ సంఘం భవనంలో నామినేషన్ల ప్రక్రియను ఎన్నికల అధికారి నాగిరెడ్డి నిర్వహించారు. ఆయా పదవులకు ఒక్కొక్కరు మాత్రమే నామినేషన్లు దాఖలు చేశారు. ఆదివారం ఎన్నికలు జరుగనుండగా కార్యవర్గం పదవులకు పోటీలేకపోవడంతో ఏకగ్రీవమయ్యాయి. నూతన కమిటీని ప్రస్తుత అధ్యక్ష, కార్యదర్శులు చేపూరి శ్రీనివాస్, వైద్య శివప్రసాద్ అభినందించారు.

పోలీసు సేవలపై అవగాహన అవసరం

సిరిసిల్లక్రైం: షీటీమ్ గురించి ప్రతీ ఒక్కరికి అవగాహన అవసరమని షీటీమ్ ఎస్‌ఐ ప్రేమ్‌దీప్ అన్నారు. జిల్లా గ్రంథాలయంలో షీటీమ్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. మహిళలు, యువతులు ఆపదలో ఉన్నప్పుడు డయల్ 100కు, జిల్లా షీటీమ్ నంబర్ 8712656425లో ఫిర్యాదు చేయాలని కోరారు. గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య పాల్గొన్నారు.

గిరిజనుల అడవిబాట

- ఇప్పపువ్వు, తునికాకు సేకరణతో ఉపాధి
- అడవితల్లితో ముడిపడిన జీవనం
- ఉదయం నుంచి రాత్రిదాకా అక్కడే..



ఎండలో ఆరబోసిన ఇప్పపువ్వు



ఇప్పపువ్వులు ఏరుతున్న వృద్ధురాలు

వీర్నపల్లి(సిరిసిల్ల): గిరిజన బిడ్డలకు అడవితల్లే అమ్మవుతోంది. అడవిలో ఇప్పపూలు, తునికాకు సేకరణతో గిరిజనులు ఉపాధి పొందుతున్నారు. మండలంలో అన్నిగ్రామాల్లో ప్రస్తుతం ఇప్పపువ్వుల సీజన్ నడుస్తోంది. ప్రతి సంవత్సరం మార్చి నుంచి మే చివరి వరకు ఇప్పపువ్వు సేకరణలో గిరిజనులు నిమగ్నమవుతారు. తునికాకుతో పాటు ఉపాధినిచ్చే ఇప్పపూల కోసం ఉదయం నుంచి రాత్రి వరకు చిన్నా, పెద్దా అంతా తట్టా, బుట్టాలు పట్టుకొని అడవిబాట పడుతుంటారు. గిరిజనులు జరుపుకునే సాంప్రదాయ వేడుకలు, తీజ్ సంబరాలు, వివాహాల సమయాల్లో ఇప్పపువ్వులతో తయారుచేసిన సారాయి తాగడం ఆచారంగా పాటిస్తారు. వర్షాకాలం వచ్చిందంటే చిక్కుడు గింజలు, అల్చందలు కలిపి ఉడికించి అంబలి కాస్తారు. మరికొందరు గిరిజనులు ఇప్ప ఉండలను అల్పాహారంగా తీసుకుంటారు.

ఇప్పపువ్వు ప్రారంభ దశ..

వేసవిముందు ఫిబ్రవరి, ఏప్రిల్ నెలల ఇప్పచెట్లు ఆకురాలుస్తాయి. ఆ సమయంలో కస్తూరి వాసన కలిగిన పూలు పుష్పించడం మొదలవుతాయి. ఇప్పపువ్వులు సాధారణంగా ఉదయం సమయంలోనే రాలుతాయి. ఒక ఇప్పచెట్టు నుంచి సుమారు 20 నుంచి 50 కిలోల ఇప్పపూలు రాలుతాయి. ఇలా రాలిపడిన పూలను సేకరించి ఎండలో ఆరబెడుతారు. బాగా ఎండిన తర్వాత ఒక లావుపాటి కర్రతో పూలలోని పొట్టుపోయేంత వరకు కొట్టి, గాలిదూరని విధంగా సంచుల్లో నింపి నిల్వచేస్తారు. వీటిని తమ అవసరాలకు ఉపయోగిస్తారు.

ఉపయోగాలు..

చాలామందికి ఇప్పపువ్వులతో సారాయి తయారు చేసేందుకే వాడుతారు అని తెలుసు. కానీ సారాయి కాకుండా గిరిజనులు ఇప్పపూలను పెంకుల్లో వేయించి తర్వాత దంచిన వెల్లుల్లి, మిర్చి, అల్లం కలుపుతారు. అన్నీ కలిపి మోదుగాకుల్లో ఉండలుగా చుట్టుతారు. వాటిని నెయ్యితో కలిపి తింటారు. ఇప్పపువ్వును నిల్వ చేసుకొని తినడంతో ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనం కలుగుతుంది. రక్తహీనతతో బాధపడే వారికి ఇప్పపువ్వు ఉండలు ఎంతో ఉపయోగం అని గిరిజనులు చెబుతున్నారు. ఇప్పపువ్వు ఉండలు గర్భిణిలకు పౌష్టికాహారంగా ఉపయోగపడుతాయి.

మూగజీవాలకు ఆహారంగా..

అడవిలో ఇప్పపువ్వులు పడే సమయంలో గొర్ల కాపరులు ఉదయమే గొర్లను, మేకలు తోలుకొని అడవికి వెళ్తుంటారు. ఇప్పపువ్వులు గొర్లు, మేకలు కాకుండా అడవిలో ఉండే మూగజీవాలకు కూడా ఆహారంగా ఉపయోగపడుతున్నాయి. ఇప్పపువ్వు తిన్న మూగజీవాలు పొద్దంతా మత్తులో ఉండి హాయిగా నిద్రిస్తాయి.

సొసైటీ ద్వారా కొనుగోలు చేయాలి..



గిరిజనులు ప్రతి సంవత్సరం మార్చి నుంచి మేనెలలో ఇప్పపువ్వును సేకరిస్తారు. కానీ ఆ పువ్వును ఎక్కడ అమ్మాలో తెలియక దళారుల చేతులో మోసపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కామారెడ్డి గిరిజన కార్పొరేషన్ సొసైటీ ద్వారా కొనుగోలు చేసి వారిని ఆదుకోవాలి.
– గద్దరాశి భగవంతం,
– మాజీ వన సంరక్షణ సమితి చైర్మన్, వీర్నపల్లి

అదే ఆచారం కొనసాగిస్తున్నాం..



చిన్నతనంలో తల్లిదండ్రులతో కలిసి ఇప్పపూవ్వు, తునికాకు ఏరేందుకు వెళ్లేదానిని. మా అమ్మ ఇప్పపువ్వుతో బలంకోసం కుడుములు, బెల్లం ముద్దలు చేసి ఇచ్చేది. అదే ఆచారం ఇప్పటికీ మా పిల్లలకు కొనసాగిస్తున్నా.
– భూక్య యాదవ్వ,
గిరిజన మహిళ వీర్నపల్లి

ఔషధ మొక్కగా ఉపయోగించొచ్చు



ఇప్పచెట్టును ఔషధ మొక్కగా ఉపయోగించవచ్చు. ముఖ్యంగా కీళ్ల నొప్పులు, కొవిడ్ 19, గర్భిణులు, రక్తహీనత తగ్గించేందుకు దోహదపడుతుంది. అలాగే కొన్ని రకాల చర్మ వ్యాధులను తగ్గించేందుకు ఉపయోపగపడుతుంది.
– నలెంద్రి లింబాద్రి,
పీహెచ్‌డీ కెమిస్ట్రీ

తప్పులు లేని ఓటర్ జాబితా సిద్ధం చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ ఖిమ్యానాయక్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ ఖిమ్యానాయక్

సిరిసిల్ల: జిల్లాలో తప్పులు లేని ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ఎస్.ఖీమ్యానాయక్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్, సంయుక్త ఎన్నికల అధికారి రవికిరణ్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రిటర్నింగ్ అధికారులను నియమించేందుకు నిర్దేశించిన నమూనాను మూడు రోజుల్లో పంపాలన్నారు. ఎన్నికల నిర్వహణకు మాస్టర్ ట్రైనర్లను ఎంపికచేసి ఏప్రిల్ నెలఖరులోగా అందించాలని వికాస్ రాజ్ ఆదేశించారు. అనంతరం అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ జిల్లా అధికారులతో ఓటర్ల నమోదుపై సమీక్షించారు. ఏప్రిల్ 1నాటికి 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కును కల్పించాలని సూచించారు. ప్రతి శనివారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు టి.శ్రీనివాస్‌రావు, పి.పవన్‌కుమార్, సిరిసిల్ల, వేములవాడ తహసీల్దార్లు విజయ్‌కుమార్, రాజిరెడ్డి, ఎన్నికల విభాగం ఉప తహసీల్దార్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే స్టోన్ క్రషర్ నిర్వహణ

- మైనింగ్ ఏడీ సైదులు



జిల్లెల్లలో స్టోన్ క్రషర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

తంగళ్లపల్లి: ప్రభుత్వ నిబంధనల ప్రకారమే శాంభవి స్టోన్ క్రషర్ నిర్వహిస్తున్నట్లు మైనింగ్ ఏడీ సైదులు పేర్కొన్నారు. ఈనెల 16న స్టోన్ క్రషర్ మూసివేయాలని అనే శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీంతో బుధవారం మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు తనిఖీలు చేపట్టారు. శాంభవి స్టోన్ క్రషర్ ప్రభుత్వ నిబంధనల ప్రకారమే నిర్వహిస్తున్నట్లు మైనింగ్ ఏడీ సైదులు తెలిపారు. అన్నిశాఖల అనుమతులు ఉన్నట్లు ఆయన తెలిపారు.

మరో యువతితో రెండో పెళ్లికి యత్నం

- భర్త ఇంటి ముందు బైఠాయించిన భార్య
- పరారీలో భర్త, బంధువులు
- సఖి సెంటర్‌కు తరలించిన పోలీసులు



ప్రవీణ్ ఇంటిముందు బైఠాయించిన లత

కోనరావుపేట(వేములవాడ): ఒకరిని ప్రేమించి పెళ్లి చేసుకుని, మరొకరితో రెండో వివాహానికి సిద్ధమైన విషయం తెలుసుకున్న సదరు వివాహిత భర్త ఇంటి ముందు ఆందోళనకు దిగింది. ఈ సంఘటన కోనరావుపేట మండలంలోని నిజామాబాద్‌లో బుధవారం జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాలు. గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన దోసల లత, కోనరావుపేట మండలం నిజామాబాద్‌కు చెందిన సుదమల్ల ప్రవీణ్ గత ఐదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లికి పెద్దలు అభ్యంతరం తెలపడంతో 2021 అక్టోబర్ 7న గంభీరావుపేటలోని మానేరు చర్చిలో పెళ్లి చేసుకున్నారు. తర్వాత హైదరాబాద్‌లో కొన్ని నెలలు కలిసి ఉన్నారు. రెండు నెలల క్రితం లతను ఇంటి వద్ద దింపేసి ఇంట్లో వాళ్లని ఒప్పిస్తానని చెప్పి నిజామాబాద్‌లోని తల్లిదండ్రుల వద్దకు వచ్చాడు. అప్పటి నుంచి ఫోన్ చేయడం కూడా మానేశాడు. ప్రవీణ్‌కు వేరే సంబంధాలు చూస్తున్నారని తెలిసిన లత కొన్ని రోజుల క్రితం నిజామాబాద్‌కు రాగా భర్త కుటుంబ సభ్యులు దాడిచేసి వెళ్లగొట్టారు. ఈ విషయమై గంభీరావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మంగళవారం గ్రామంలో పంచాయితీ నిర్వహించగా ప్రవీణ్ రాలేదు. దీంతో తన భర్త వచ్చే వరకు ఇక్కడే ఉంటానంటూ ఇంటి ముందు బైఠాయించింది. కుటుంబసభ్యులు ఇంటికి తాళం వేసి వెళ్లారు. ప్రవీణ్ పరారీలో ఉన్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు బుధవారం గ్రామానికి వచ్చి లతను సిరిసిల్లలోని సఖీ సెంటర్‌కు తరలించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



లింగు ఆనందం (ఫైల్)

కోనరావుపేట (వేములవాడ) : మండలంలోని మరిమడ్ల–వట్టిమల్ల గ్రామాల మధ్య అజ్మీరాతండా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నిజామాబాద్ జిల్లావాసి మృతిచెందాడు. నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం.. తాటిపెల్లికి చెందిన లింగు ఆనందం మండలంలోని వట్టిమల్లలో బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి వచ్చాడు. ద్విచక్రవాహనంపై తిరిగి వెళ్తుండగా భుక్యారెడ్డి తండా దాటిన తర్వాత క్రాసింగ్ వద్ద సిరిసిల్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో లింగు ఆనందం అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య దేవేంద్ర, కుమారులు ప్రభాకర్, మల్లేశ్, కూతురు మమత ఉన్నారు.

సర్పంచ్ ఆధ్వర్యంలో మెదక్ చర్చి సందర్శన

- ప్రత్యేక బస్సుల్లో తరలిన ఎల్లారెడ్డిపేట గ్రామస్తులు



మెదక్‌కు వెళ్తున్న ఎల్లారెడ్డిపేట గ్రామస్తులు

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి తన సొంత ఖర్చులతో గ్రామానికి చెందిన క్రైస్తవులను బుధవారం మెదక్ చర్చి సందర్శనకు తీసుకెళ్లారు. ఇటీవల యాదగిరిగుట్టకు 30 బస్సులలో గ్రామస్తులను తీసుకెళ్లిన సర్పంచ్.. బుధవారం 20 బస్సులలో క్రైస్తవులను మెదక్ చర్చికి తీసుకెళ్లారు. సర్పంచ్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామస్తులు దైవమార్గంలో పయనించేలా తన వంతుగా వారికి దర్శన అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆలయాలు, చర్చీల సందర్శన సర్వమత సమ్మేళనమేనని పేర్కొన్నారు. త్వరలోనే ముస్లింలను పెద్దగుట్ట సందర్శనకు తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..



రాములు మృతదేహం

కోనరావుపేట/సిరికొండ : నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని హుస్సేన్‌నగర్ గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామానికి చెందిన డప్పు రాములు (50) మృతి చెందాడు. రాములు బంధువైన జలందర్‌తో కలిసి బైక్‌పై మండలంలోని గడ్కోల్‌కు బంధువుల ఇంటికి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో బైక్ అదుపుతప్పి కిందపడిపోయారు. వెనుక కూర్చున్న రాములుకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న జలందర్‌కు గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో సిరిసిల్లలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నర్సింలు తెలిపారు.

ఎకరానికి రూ.25వేలు పరిహారం చెల్లించాలి

- వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట వడగండ్ల వానతో పాడయిందని.. రైతులు తీవ్రంగా నష్టపోయారని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము పేర్కొన్నారు. తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం వైఎస్సార్‌టీపీ నాయకులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. పంట నష్టపోయిన అన్నదాతలకు ఎకరానికి రూ.25వేల చొప్పున పరిహారం అందించాలని కోరారు. పార్టీ తంగళ్లపల్లి అధ్యక్షుడు పూర్మాని కరుణాకర్‌రెడ్డి, కోలాపూరి ఆనంద్, గజ్జల దేవరాజు, కుమార్, అనిల్, ప్రశాంత్, తొక్కల శ్రీనివాస్‌రెడ్డి, వంగర అనిల్, మేన లక్ష్మణ్ పాల్గొన్నారు.

కొనుగోళ్లను వేగవంతం చేయాలి



రైతులతో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్



ధాన్యాన్ని పరిశీలిస్తున్న కేకే మహేందర్ రెడ్డి

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ డిమాండ్

కోనరావుపేట (వేములవాడ): వడగళ్ల వానతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని శివంగాలపల్లిలో మంగళవారం రాత్రి కురిసిన వడగళ్ల వర్షానికి నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా ఇప్పటివరకు ధాన్యం కొనుగోళ్లను మొదలుపెట్టలేదన్నారు. పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, ఎకరానికి రూ. 25 వేల నష్టపరిహారం అందించాలన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. ఇళ్లు, రేకులషెడ్లు కూలిపోతే వారిని గుర్తించి డబుల్ బెడ్రూమ్ పథకంలో లబ్ధిదారులుగా చేర్చాలన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, కిసాన్‌సెల్ అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, మోతె గంగారెడ్డి, మాజీ సర్పంచ్ రాములు, నాయకులు ప్రభాకర్, రవీందర్ రెడ్డి, నిత్యానందం పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

వీర్నపల్లి (సిరిసిల్ల) : అకాలవర్షంతో పంట నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కేకే మహేందర్ రెడ్డి అన్నారు. బుధవారం మండలకేంద్రంతోపాటు, రంగంపేట, లాల్‌సింగ్ తండా, గర్జనపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ప్రతిగింజ కొనుగోలు చేయాలని, రైతులకు ఎకరానికి రూ.25 వేలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. ఇప్పటికైనా రైతులకు నష్ట పరిహారం అందించాలని లేకపోతే రైతులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్, రైతులు, నాయకులు తిరుపతి, లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.

గంభీరావుపేట(సిరిసిల్ల): కాంగ్రెస్ నాయకుడు కేకే మహేందర్‌రెడ్డి గంభీరావుపేట మండలంలోని గోరింటాలలో పంట నష్టాన్ని పరిశీలించారు. నష్టపోయిన రైతులను పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు హమీద్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేటలో..

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): మండలంలోని ఆయా గ్రామాల్లో అకాలవర్షాలకు దెబ్బతిన్న పంటలను కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పరిశీలించారు. ఎకరాకు రూ.25వేల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ నాయకులు దొమ్మాటి నర్సయ్య, శ్రీనివాస్ రెడ్డి, లింగంగౌడ్, గౌస్, రైతులు ఉన్నారు.

టేకు కలప పట్టివేత

- రూ.50 వేల విలువ గల టేకు స్వాధీనం



పట్టుకున్న టేకు కలపతో అటవీశాఖ అధికారులు

చందుర్తి (వేములవాడ) : మండల శివారులోని అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా తరలిస్తున్న టేకు కలపను బుధవారం అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. స్థానికులు, అటవీ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో హోటల్ నిర్వహిస్తున్న ఓ వ్యక్తి అటవీ ప్రాంతంలో టేకు కలపను కూలీలతో నరికి వేయించాడు. ఆ కలపను మండలకేంద్రానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి సోదరుడి ట్రాక్టర్‌లో చందుర్తికి తరలిస్తుండగా సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు కలపను పట్టుకున్నారు. అటవీశాఖ అధికారుల నుంచి ట్రాక్టర్‌ను, కలపను విడిపించేందుకు పైరవీలు చేసినప్పటికీ ఫలించలేదు. ట్రాక్టర్‌తో పాటు కలపను సిరిసిల్ల అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. పట్టుకున్న టేకు కలప విలువ రూ.50 వేలకు పైగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. అటవీశాఖ అధికారులు మాత్రం విలువ చెప్పేందుకు నిరాకరించారు. వీరిలో సెక్షన్ అధికారిణి విజయ, బీట్ అధికారి బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టులో ప్రమాదం

- బాయిలర్‌పై నుంచి పడి అధికారి మృతి
- విచారణ చేస్తున్న ఎన్టీపీసీ పోలీసులు



జశ్వంత్ హెచ్ ఫర్‌మార్ (ఫైల్)

జ్యోతినగర్(రామగుండం): పెద్దపల్లి జిల్లాలోని ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టులో విధులు నిర్వహిస్తున్న అధికారి జశ్వంత్ హెచ్ ఫర్‌మార్(57) ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందారు. తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు స్టేజీ–1లో నిర్మితమవుతున్న 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల యూనిట్–2లోని బాయిలర్ వద్ద రెండోషిఫ్టు విధులు నిర్వహిస్తుండగా జశ్వంత్ ప్రమాదవశాత్తు 30 మీటర్ల ఎత్తు నుంచి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని ధన్వంతరి ఆస్పత్రికి తరలించగా.. చికిత్స అందించేలోపే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. జశ్వంత్ గుజరాత్‌లోని గ్యాస్ ప్రాజెక్టు నుంచి ఇటీవల ఎగ్జిక్యూటివ్ పదోన్నతిపై ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టులో విధుల్లో చేరారు. ఆస్పత్రిలోని మృతదేహాన్ని ఎన్టీపీసీ ఎస్సై బి.జీవన్ పరిశీలించి విచారణ చేపట్టారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునిల్‌కుమార్, ఐఎన్టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య వర్ష, కుమారుడు వాసు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేయనున్నట్లు ఎస్సై జీవన్ వెల్లడించారు.

వృద్ధుడి ఆత్మహత్య

సిరిసిల్లక్రైం: అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడు బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సిరిసిల్లలోని భావనరుషినగర్‌కు చెందిన మంచాల నర్సప్ప(70) కొన్నాళ్లుగా ఆస్తమా, మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నాడు. చికిత్స చేయించుకున్న తగ్గకపోవడంతో మనస్థాపం చెంది ఇంట్లోనే ఉరివేసుకున్నాడు. కేసు నమోదు చేసినట్లు సీఐ అనిల్‌కుమార్ తెలిపారు.

కొమ్ములు పొడిచిన మామిడి

సిరిసిల్లటౌన్: చెట్టుకొమ్మలకు మామిడిపండు కాయడం మామూలే. అయితే కాసిన మామిడి పండుకు కొమ్ములుంటే..ఎలా ఉంటుంది. అదో వింతే. రాక్షసులను కొమ్ములతో సినిమాల్లో చూసిన విధంగా పండు పై భాగంలో రెండు కొమ్ముల ఆకారం మామిడిపండు కాసింది. సిరిసిల్ల అంబేద్కర్‌నగర్‌కు చెందిన గడ్డం లక్ష్మి-అనంతగిరి(హెడ్‌కానిస్టేబుల్) ఇంట్లో మూడేళ్ల క్రితం మామిడి మొక్కను నాటారు. ఈ ఏడాది మొదటి కాత కాసింది. చెట్టుకు అన్ని పండ్లు చిన్నసైజులో ఉండగా..ఈ మామిడి కాయ మాత్రం ఆరు అంగుళాల సైజులో కిలోకు పైగా బరువుతో పైగా పైభాగంలో కొమ్ముల ఆకారంతో కాసింది. వింతగా ఆకట్టుకుంటున్న ఈ పండు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. దీనిని చూడటానికి జనాలు తండోపతండాలుగా వస్తున్నారు.



సిరిసిల్లలో కొమ్ములతో కాసిన మామిడి పండు